మహా పత్రిక

తెలుగు

సోమవారం, హైదరాబాద్ | 11-05-2026

సాహిత్యం -ఎడిటర్ హనీఫ్ 04

సిద్ధపడుతూ..

ఈమధ్య నేను సముద్రం దగ్గరికి మళ్ళీ వెళ్లాను
సముద్రం ఎప్పటిలానే అలలతో ఆహ్వానించింది కూడా
సముద్ర ఆహ్వానాన్ని మన్నించడం నాకు అలవాటు
అది కూడా నన్ను చూసి భలే సరదా పడుతుంది
తన చిరుకెరటాలతో నా కాళ్ళను కడిగి ఆర్తిగా ముద్దాడుతుంది
'నేనంటే నీకెందుకు అంత ప్రేమ' అని అడిగాను నేను
సముద్రం మౌనంగా నవ్వుతూ వెనక్కి జరిగింది
అప్పుడే నాలాగే ఒక 'గజ్జికుక్క' కూడా వచ్చిందక్కడికి
దాన్ని కూడా అంతే ప్రేమగా ఆహ్వానించింది సముద్రం
ప్రేమించడం సముద్ర నైజం ఆహ్వానించడం దాని అలవాటు
పిలిచింది కదా అని లోతుల్లోకి పోతే ముంచేస్తుంది మరి

సముద్రంతో జన్మజన్మల బంధం నాది
దాన్ని చూస్తే ఎక్కడలేని ఉత్సాహం నాకు
పొంగే కడలిని చూడగానే
కరిగిపోయిన నా బాల్యం నన్ను ఆవహిస్తుంది
ఉయ్యాలలూగే కెరటాల నడుమ కూర్చొని
కనుమరగయిన యవ్వనాన్ని తిరిగి పొందుతున్నప్పుడు
జీవితాన్ని మళ్ళీ మొదటి నుండి మొదలు పెట్టాలనే ఆశ పుట్టింది
అప్పుడే ఓ అల సున్నితంగా నన్ను తాకి హెచ్చరిస్తూ వెనక్కి పోయింది

మళ్ళీ ఏమనుకుందో కానీ, మరో కెరటమై తిరిగి వచ్చింది
'ఇప్పుడున్నది ఆనందించు పోగొట్టుకున్నది వెతకకు'
అంటూ గుప్పెడు గవ్వలను నా ఒడిలోకి విసిరి వెళ్ళింది
'ఎప్పుడూ పొందడమేనా అందించడం రాదా' అని గద్దించినట్లు అనిపించింది నాకు

అంతలోనే మరో కెరటం మెల్లగా వచ్చి
కొన్ని రంగు రాళ్ళను నా కాలి బొటన వేళ్ళ వద్ద వదిలి వెళ్ళింది
ఆలోచనలో పడ్డాను నేను,
నేను అలిగాను అనుకుందేమో సముద్రం
పెద్ద కెరటంతో నన్ను ఆలింగనం చేసుకుని అమ్మను గుర్తుకు తెచ్చింది

ఆ ఆనందపు కెరటాలలో నేను అణువణువూ తడిచి ముద్దవుతుండగా
బలమైన అల ఒకటి చెంప చెళ్ళుమనిపించింది

'కలలు కనే తరుణమా ఇది?
కరిగి పోతున్న కాలం విలువ తెలియట్లేదా?' అని గర్జించింది.

'కలలెక్కడ కంటున్నాను,
నేనూ నీలోకి చేరాలని అనుకుంటున్నాను' అని సణిగాను

సముద్రం కోపంతో ఉప్పొంగి, నన్ను పైకి లేపి తీరం వైపు విసి కొట్టింది
బిత్తరపోయి చూస్తూండగా
చిరు అలల సమూహం ఒక్కటొక్కటి వరుస కట్టి
ఈ యుద్ధ సమయంలో శాంతి కోసం ఏమి చేశావు?
నీ అక్షర సేద్యం ఏమయింది?
నువు చెప్పిన 'పే బ్యాక్ టు నేచర్' ఏమి చేశావు?
నీ 'బహుజన వాదం' ఏమంటుంది?
'మేమెంతో మాకంత' నినాదం ఎక్కడ పోయింది?
తెలంగాణ కథ ఎక్కడాగింది?
బహుళను ఏమి చేశావు?
అంటూ ప్రశ్నల శరాలను సంధించాయి

హోంవర్క్ గుర్తొచ్చిన విద్యార్థిలా
ఒంటికంటిన ఇసుకను దులుపుకుంటూ ఇంటిదారి పట్టాను.
'మళ్ళీ రావోయి నేస్తం, నీకోసం ఎదురు చూస్తుంటాను'
అంటూ వెనుక నుండి సముద్రం ఘోష పెడుతూనే వుంది
అమ్మ మీద అలిగిన చిన్నదానిలా
వెనుదిరిగి చూడకుండా
యుద్ధానికి సిద్ధపడుతూ ముందుకు నడిచాను నేను

- జ్వలిత, 9989198943

జీవన సంక్షోభాల్ని వొంపిన తమిళ హైకూలు

గ్రీష్మం సెగలు గక్కేవేళ ఒక చల్లని మలయమారుతంలా హృదయాన్ని తాకి ఆహ్లాదపరిస్తే అది హైకూ అవుతుంది. అందులోని భావాలు అలలుఅలలుగా పురివిప్పి హృదయం ఆలోచనల కదలియై ఎగిసిపడుతుంది. అవును హైకూ చూపించే ప్రభావం అలాంటిది. అల్పాక్షరాలతో తన భావవిన్యాసంతో అలరించే హైకూ తొలుత జీవనతాత్వికతకే ప్రాధాన్యతనిచ్చినా ఇప్పుడది మానవ జీవితంలోని ఎన్నోన్నో దృశ్యాలను స్పృశిస్తోంది. ఎన్నెన్నో సమకాలీన సామాజిక సందర్భాల్నీ, సంఘటనల్నీ గుప్పిట పట్టుకుంటోంది. ముఖ్యంగా ఇప్పటి సామాజిక సంక్లిష్టతను ప్రతిబింబిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది తమిళ హైకూ. అలాంటి తమిళ హైకూల్లో కొన్నింటికి తెలుగు సొబగులు అద్ది గిడ్డకింద మాణిక్యం అందించిన తాజా హైకూ సంపుటి 'దిగులు కొంగ'.

బుద్ధుడి జెన్ తత్వాన్నిఆకళింపు చేసుకొని ప్రపంచంలోనే తొలిసారిగా శతాబ్దాలకు పూర్వం జపనీయుల హృదయస్పందనల్లోంచి ఆవిర్భవించిన హైకూ ప్రక్రియ తొలుత ప్రకృతి ప్రియత్వం, ప్రేమతత్వం, జీవన తాత్వికత, నిగూఢత్వం లక్షణాలతో ప్రారంభమైనా ఇప్పుడు వస్తువురీత్యా సరికొత్త రూపాల్ని సంతరించుకుంటోంది. గత దశాబ్దకాలంగా మానవజీవ నపరివేదనకు తోడై అతని జీవన సంక్షోభాల్నీ తనలోకి వొంపుకుంటోంది. ఈ ప్రక్రియ ప్రపంచంలోని ఎన్నో భాషల్లోకి ప్రయాణించినట్టుగానే తమిళం లోనూ తన ఉనికిని చాటుకుంది. 1916 ప్రాంతంలో కవికులతిలకుడు సుబ్రమణ్య భారతి తొలిసారిగా హైకూ ప్రక్రియను తాను రాసిన ఒక వ్యాసం ద్వారా తమిళ సాహితీరంగానికి పరిచయం చేశాడు. అనంతరం అరవయ్యేళ్ల తరువాత 1966 నుంచి తమిళంలో హైకూ ప్రాచుర్యం పొందడం ప్రారంభమైంది. కనెయళి, దీపం వంటి పత్రికలు హైకూకు ఎంతగానో ప్రాచుర్యం కల్పించాయి. 'హైకూ' పేరుతోనే ఒక పత్రిక కొన్నాళ్లపాటు నడిచింది. 1984లో 'వల్లపూక్కళ్' అనే హైకూ సంపుటితో ప్రారంభమైన హైకూ ప్రస్థానం నిరంతరం కొనసాగుతూనేవుంది. ఇప్పటివరకు తమిళంలో దాదాపు వెయ్యికిపైగానే హైకూ సంపుటాలు వెలువడ్డాయి. మారుతున్న కాలపరిస్థితులకనుగుణంగా హైకూ కవితావస్తువులు మారడమే అందుకు ప్రధాన కారణం. తమిళనాట హైకూను గుర్తించిన అక్కడి ప్రభుత్వంతో బాటు కొన్ని చిన్న పత్రికలు కూడా హైకూలకు పురస్కారాలు అందజేస్తుండడం ముదావహం. అక్కడి యూనివర్సిటీల్లో హైకూపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. పా. ఉదయకన్నన్, ఎస్. మురుగాశన్, హెబున్ వంటి కవులు తమ కవితాప్రయాణాన్ని హైకూలమీదే సాగించడం విశేషం. అందుకే తమిళనాట పోటీప్రపంచంలో హైకూ ఒక ప్రధాన ప్రక్రియ అయిపోయింది. చెన్నైలోని ఒక వీధికి హైకూ పేరు పెట్టాలని ఒక సందర్భంలో తమిళ హైకూ రచయితల సంఘం ప్రతిపాదించడం తమిళ సాహితీరంగంలో హైకూ ప్రాభవాన్ని సూచిస్తుంది. ప్రస్తుతం తమిళ హైకూల్లో ఎన్నోనిత్యజీవిత సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వాటిలో సామాజిక చైతన్యం వెల్లివిరుస్తోంది. తమిళనాట కవివరేణ్యుడు అబ్దుల్ రెహమాన్ సంస్మరణార్థం నిర్వహించిన హైకూల పోటీకి వచ్చిన ఎనిమిదివేల హైకూల్లోంచి ఎంపిక చేసిన 55 హైకూలతో తమిళ దర్శకుడు లింగుస్వామి 'వాడియదు కొక్కు'(వాడిపోయిన



కొంగ) అనే పేరుతో వెలువరించిన హైకూ సంపుటిని కథకుడు, ఎస్వీయూ సైన్సు పరిశోధక విద్యార్థి గిడ్డకింద మాణిక్యం అనువదించిన తీరులో అనువాదకుని నేర్పరితనమూ, తమిళ మూలాన్ని చెడగొట్టని తెలుగుదనమూ కనిపిస్తాయి. అందుకే ఈ హైకూలను చదువుతున్నప్పుడు మాతృభాషలో చదివినంత అనుభూతి కలుగుతుంది. తెలుగు, తమిళ ప్రాతాల సరిహద్దు ప్రాంతానికి చెంది 'బోర్డరోడు'గా గుర్తింపు పొందిన ఈ అనువాదకుడు రెండు ప్రాంతాల భాషాసంస్కృతులను బాగా ఆకళింపు చేసుకున్నవాడిలా కనిపిస్తాడు. ఈ హైకూలన్నింటి లోనూ కవుల విలక్షణ దృష్టితో పాటు విభిన్న సామాజిక దృక్కోణాలూ కనిపిస్తాయి. ప్రకృతి ప్రతీకలతో విభిన్న సమకాలీన సామాజిక సమస్యల్ని ఎత్తిచూపడం, కొన్ని సామాజిక సందేశాల్ని అందించడం ఈ హైకూల్లోని ప్రత్యేకత. మనిషి అనంత జీవన సంక్షోభాల్నిఈ హైకూల్లోని అల్పాక్షరాలు స్పృశించాయి. ఈ సంపుటి శీర్షికకు అనుబంధంగా వున్న మొదటి హైకూనే సామాజిక వర్గసంఘర్షణను ప్రతిబింబిస్తుంది. 'కొంగ వాడిపోయింది/కొలనులో ఈదిందల్లా/జంట చేపలు'... ఈ హైకూలో కవి కొంగ, చేపల మధ్య వర్గసంఘర్షణను సూచిస్తున్నాడు. ఇక్కడ కొంగ స్వార్థంతో కూడిన దోపిడీ వ్యవస్థకు ప్రతీకగా, చేపలు శ్రామిక వ్యవస్థకు ప్రతీకలుగా కనిపిస్తాయి. 'జంట' అనే పదప్రయోగం సామూహిక చైతన్యాన్ని సూచిస్తుంది. చేపలు జంటలుగా వున్నందువల్ల కొంగ వాటిని పట్టుకోలేక నిస్సహాయస్థితికి లోనైంది. 'దిగులు' అనే పదప్రయోగం కొంగ మానసికస్థితిని సూచిస్తుంది. అలాంటి స్థితి దోపిడీవ్యవస్థకు రావాలని ఈ కవి ఆశిస్తున్నాడు. అందుకే ఈ సంపుటికి వున్న ముఖచిత్రం కూడా సామూహిక చైతన్యాన్ని సూచిస్తుంది. 'బుడ్డలమ్మేటోల్ల/ఊపిరి వెల/పది రూపాయలు'.. అంటూ సాగే మరో హైకూ ఒక పేదవాడి నిలువెత్తు జీవనసంఘర్షణకు అద్దం పడుతుంది. బెలూన్లు విక్రయించే వ్యక్తి దానికి ఊపిరి పోయడానికి తన ఊపిరిని ఫణంగా పెడతాడు. అందుకే ఊపిరి ఊగిసలాటలో దుర్భరమయ్యే అతని జీవితం వెలకట్టలేనిది. ఈ దేశాన్ని పట్టిపీడించే ఒక ప్రధాన సమస్యను ఎత్తి చూపే హైకూ ఇలా సాగుతుంది... 'ఊరంతా స్మశానం/కులం మాత్రం/కాలనే లేదు'... ఈ దేశంలో ఊళ్లకు ఊళ్లను స్మశానాలుగా మార్చివేస్తున్న కులవ్యవస్థ ఎంత వికృతరూపం దాలుస్తోందో వివరిస్తోందీ హైకూ. 'కాలనేలేదు' అన్న వాక్యం ఈ హైకూను శక్తివంతం చేసింది. 'నా ముఖంలో యాసిడ్ మంటలు/వాడి ముఖంలో/నవ్వులై పూసాయి'...దగాపడ్డ ఒక స్త్రీ జీవనసంఘర్షణను సూచించే హైకూ ఇది. పురుషాధిక్యత సృష్టించిన హింస కర్కోటకుడి నవ్వులుగా ఎలా మారిందో వివరిస్తోంది. 'గాలంలో/చిక్కిన చేప కళ్లలో/నది పారుతోంది'. ఒక చేపకు రాబోయే జీవనసంక్షోభాన్నికళ్లముందు ఆవిష్కరించే హైకూ ఇది. గాలంలో చిక్కుకుపోయాక చేప జీవితం సంక్షోభమే. అందుకే దాని కళ్లు నదులైపోయాయి. ఇక్కడ కవికి నది రెండు విధాలుగా కనిపించింది. హుషారుగా ప్రవహించే నది ఒకటైతే విషాదానికి సంకేతంగా చేప కళ్లలో కనిపించే నది మరొకటి. 'వృద్ధాశ్రమంలోని/తల్లిదండ్రులు/ఇంటికొచ్చారు చిత్రపటంలో'... తల్లిదండ్రుల పట్ల పిల్లల బాధ్యతారాహిత్యం నేపథ్యంలో ఆ అనుబంధరాహిత్యం ఒక మహా విషాదమై కనిపించే హైకూ ఇది. 'గాలీ నిదానించు!/ఎగరడానికి లోనేర్చుకుంటోంది/చిన్న సీతాకోకచిలుక'... చదువుల పేరుతో పిల్లల మీద అధిక వొత్తిడిని కలిగిస్తున్న పెద్దల అజమాయిషీని ప్రశ్నిస్తోందీ హైకూ. ఇక్కడ గాలి పెద్దల అజమాయిషీకి సంకేతం. పిల్లల పెంపకం ఎలా వుండాలో సీతాకోకచిలుక ద్వారా చెబుతున్నాడీ కవి. 'చెట్టునీడలో/మాట్లాడుకున్నారు/నరికే రోజు గురించి'.. స్వార్థపూరితమైన మానవ మనస్తత్వాన్ని ప్రతిబింబించే హైకూ ఇది. చెట్టునీడను విస్మరించడం మనిషి దౌర్బల్యాన్ని సూచిస్తుంది. 'చివరి ఆకు రాలినా/వెన్నెలను సింగారించుకున్నది/చెట్టు'...నిండైన ఆత్మవిశ్వాసానికి ప్రతీక ఈ హైకూ. మోడైపోయిన చెట్టుకూడా నెన్నెలతో మెరుస్తున్నట్టు నిరాశతో కూరుకుపోయిన మనిషి కూడా ఆత్మవిశ్వాసాన్ని నింపుకోవాలని సందేశాన్నిస్తుంది. 'ఆకుల్లో చప్పుడు/ఆ గాలికే/ఆకుల మరణం'... జీవన తాత్వికత తొణికిసలాడే హైకూ ఇది. ఆకుల ఆనందపు చప్పుడుకు కారణమయ్యే గాలి చేతిలోనే ఆకుల మరణం సంభవిస్తుంది. ఇక్కడ గాలి కాలానికి సంకేతం. మనిషికి జన్మనిచ్చిన కాలమే అతడికి మరణాన్నీ ప్రసాదిస్తుంది. 'నెమలీకలు/కొత్త ఈకలు పెట్టాయి/బడి జ్ఞాపకాలను'... బాల్యపు నోస్టాల్జియా జ్ఞాపకాలను గుర్తుచేస్తుందీ హైకూ పుస్తకంలో దాచుకున్న నెమలీకల ద్వారా. ఎన్నటికీ బాల్య జ్ఞాపకాలై మనిషిని అలరించే నెమలీకలకు జీవత్వాన్ని ప్రసాదించింది ఈ హైకూ.

హైకూ కవితావరణంతో పూర్తిగా మమేకమైతేనే పాఠకుడు ఆ హైకూ అంతరాల్ని అందుకోగలడు. ఈ విషయంలో అతడు కవిత అంతరంగం మీద దృష్టి పెట్టి కొంత కసరత్తు చేయాల్సి వుంటుంది. ఈ హైకూల్లో కనిపించే మరో ముఖ్యమైన అంశం కవుల విలక్షణత అనే క్రాంత దర్శనం. ఈ దర్శనం ద్వారానే కవి తన సందేశాన్ని వినిపించగలడు. అనునిత్యం సంభవించే అనేక జీవన సంఘర్షణలను అక్షరాల్లోకి వొంపి తమ ఉనికిని సార్థకం చేసుకున్నాయి ఈ తమిళ హైకూలు. జీవన లోగిళ్లలో ఎన్నటికీ వాడిపోని తోరణాలు పూలరేకులు.



- డాక్టర్ కొత్వాలు అమరేంద్ర,
సెల్ : 9177732414

ఫీచర సునీత రావు 2026 పురస్కారాలు

ప్రతిష్టాత్మకమైన ఫీచర సునీత రావు 2026 పురస్కారాలలో కవితా విభాగానికి బాణాల శ్రీనివాసరావు(రాత్రి సింఫనీ),కథా విభాగంలో జి ఉమామహేశ్వర్ రావు (అహానికావల), మరియు స్వర్ణ కిలారి (గోడవతల) విమర్శ లో(తెలంగాణ కవి ముద్ర) బందారి రాజకుమార్, (తొలితరం కథకుల కథనరీతులు) కేపీ అశోక్ కుమార్ ఎంపిక అయ్యారు. కథలోను విమర్శలోను సమానమైన మార్కులు పొందడం వల్ల పురస్కారాన్ని ఇద్దరు విజేతలకు సమానంగా విభజించడం జరుగుతుంది. విమర్శకు న్యాయ నిర్ణేతలుగా డా. యస్. రఘు, పొట్లపల్లి శ్రీనివాసరావు,, కథలకు ఆదెపు లక్ష్మీపతి, బి వి ఎన్ స్వామి, కవితా సంపుటాలకు వెల్దండి శ్రీధర్, దేవనపల్లి వీణా వాణి వ్యవహరించారు. 24 మే 2026 సాయంత్రం ఐదున్నర గంటలకు రవీంద్ర భారతి మినీ హాల్లో విజేతలకు ప్రముఖ సాహితీ వేత్తలతో 15వేల నగదు పురస్కారం, సత్కారం ఉంటుంది.
- విజయేందర్‌రావు ఫీచర సునీతా రావు ఫౌండేషన్ చైర్మన్.

- కాంచపల్లి గోవర్ధన రాజు
సెల్ : 9676096614

అమలా మాలిక్

సైతాను
ఆమెను జింక పిల్లను
వేటాడి నట్టు వేటు వేసాడు
చావు నీడలా చుట్టేస్తున్నా
ఆమె
యుద్ధ పిపాసిని

ప్రపంచం ముందు
నిలబెట్టింది
ఆమె కాళ్ళ ముందు
క్షిపణి విధ్వంసం
ఆమె చేరిన ఇంటిపైనా
ఉన్మాది క్షిపణి
మంటల్లో కాలిన నిజం
ఆమె యుద్ధ బీభత్స
చిత్రం
జగతి ముందు
పరిచింది
యుద్ధ విరమణ ప్రకటించి
దొంగదెబ్బ తీసిన యుద్ధోన్మాది
గులాబీ పువ్వుల రేకులను
చిదిమేసాడు
జాస్మిన్ చిరు మందహాసాలను
మంటల్లో తోసేసాడు
గూడును దాటని
పక్షుల ప్రేమ మందిరాలను

కూల్చాడు
యుద్ధపిపాసి
నెత్తుటి బొట్లను లెక్కిస్తున్నాడు
అల్లుకున్న లేతకొమ్మలను
క్షిపణులతో విరిచేస్తున్నాడు
నెలవంకను కాళ్ళకింద
నలిపేస్తున్నాడు
చిట్టిచేతులు కట్టుకున్న
ఇసుక గూళ్లను
బుల్డెట్లతో కూలుస్తున్నాడు
జంట కబూతర్ గుండెల్ని
పిండేస్తున్నాడు
విలపించే ఎడబాటును
కానుక చేస్తున్నాడు
ఆమె రాసిన డైరీ లో
ఛిద్రమైన భాగాలు
కలిపి చదివితే కన్నీటి ముత్యాలే
చేతులకు అంటుతున్నవి రక్తపు చుక్కలే

(లెబనాన్ జర్నలిస్ట్ అమలా మాలిక్
యుద్ధ వార్తలు చూపిస్తూ నేలకొరిగింది)

డా.సుంకర రమేశ్
9492180764

బీరూట్

ఇప్పుడు
పిల్లల కోసం
దుఖించే మనుషులు కావాలి

ఎవరి పనులలో
వాళ్ళు కొట్టుకుపోయి
కన్నీళ్లు ఇంకిపోయిన
మనుషులుగా మిగిలాం

ఈ ప్రపంచానికి
శాంతిని ప్రేమను
బోధించిన
ఖలీల్ జిబ్రాన్
సమాధి నుండి
లేచి దుఖిస్తున్నాడు

ప్రపంచమంతా
ఒంటరిగా మిగిలిపోయి
బీరూట్ కాలిన
కమురు వాసనలో
పేలాలు ఏరుకుంటుంది

ఇందుకు
నేనూ నా దేశం
మినహాయింపు కాదు
బూటకపు ఎన్నికల
మత్తులో ఈరోజు
యేనబై శాతం
ఓటు వేస్తూ మురిసిపోతే
రేపది తొంబై శాతం అయి
వాడి గెలుపును చూపుతుంది

మాకిక్కడ మా
రోజు గడిస్తే చాలు
మా గుండెలు నిండా
ఇప్పుడు కాషాయం
కంపు నిండి
రక్తం పలచబడి పోయింది

బీరూట్
క్షమించు
మీ పిల్లలపై కురిసిన
బాంబులు మా
కార్పొరేట్ కార్ఖనాలో
తయారైనందుకు

మన్నించు
ప్రేమ బోధకుడా....

- కెక్యూబ్
9493436277

మానవత్వమే మహాప్రస్థానం

విశ్వవీధిలో విరిసిన ప్రాణి మనిషి
వివేక గమ్యం చేరాల్సిన జ్ఞాని మనిషి
ఆకృతిలో కేవలం అల్పజీవి కాదు
ఆశయాల్లో అతడు సామాన్యుడు కాదు
మట్టిలో పుట్టి మిన్నేరైనవాడు
మమతను పంచే మహనీయుడు కాదు
మనిషి అంటే కేవలం ఒక రూపం కాదు
మంచిని పెంచే ఒక గొప్ప నిరూపకం
కరుణ గుండెల్లో కడలిలా పొంగాలి
కష్టాల్లో ఉన్నోడికి కండలై నిలవాలి
కన్నీటి చుక్కను తుడిచేటి హస్తం
కావాలి లోకానికి అసలైన ప్రాశస్త్యం
దాతృత్వ గుణమే మనిషికి కిరీటం
దానమే ప్రాణికి సార్థక లలాటం
ఉన్నదంతా దాచుకుంటే మిగిలేది శూన్యం
ఒకరికి సాయపడితేనే జీవితం ధన్యం
మేఘం నీటిని మోసి వర్షిస్తుంది
చెట్టు పండ్లను కోసి అర్పిస్తుంది
ప్రకృతి పాఠం త్యాగమే కదా
మరి మనిషి గమ్యం స్వార్థమే ఎలా?
చేయి చాచిన వేళ చిరునవ్వు చిందించు
పరుల ఆకలి తీర్చి పుణ్యాన్ని పొందు
పచ్చని చేనులా ఎద ఎద ఎదగాలి
మచ్చలేని చందమామలా వెలగాలి
పదవి కన్నా గొప్పది కదా పరోపకారం
ఆస్తి కన్నా మిన్న కదా అందరి క్షేమం
గోడలు కట్టేవాడు లోకంలో ఎందరో
వంతెనలు వేసేవాడు మానవత్వ మూర్తి
కండబలం చూపి గెలవడం కాదు గెలుపు
గుండె బలం చూపి నిలవడమే గెలుపు
అసూయల చీకటిని అంతం చేయాలి
అనురాగ దీపాన్ని అనునిత్యం వెలిగించాలి
మాటలో మాధుర్యం మనిషికి అలంకారం
చేతలో ఔదార్యం బ్రతుకుకు సంస్కారం
కులం కన్నా మిన్న గుణం ఉండాలి
మతం కన్నా మిన్న మానవత్వం నిండాలి
ఒకరి బాధ చూసి చలించేది ప్రాణం
ఒకరి తోడు కోరి నిలిచేది గమనం
దాత అంటే ధనవంతుడు మాత్రమే కాదు
దాచుకోక ఇచ్చే ప్రతివాడు మనిషే
ముళ్ళ దారిలో పూలబాటలు వేయాలి
ముక్కలైన మనసులను మళ్ళీ చేర్చాలి
ద్వేషపు జ్వాలను ప్రేమతో ఆర్పాలి
స్నేహపు విలువను లోకానికి చాటాలి
మనిషి మహాగానే ఎదగాలి ఇక్కడ
మట్టిలో కలిసినా మిగలాలి జ్ఞాపకం
చరిత్ర పుటల్లో సంతకం కావాలి
చచ్చేలోగా ఒక వెలుగు కావాలి
మానవత్వం లోనూ మనిషి మహానుభావుడే
దాతృత్వం లోనూ మనిషి మహాత్ముడే
పంచుకుంటే పెరిగేది కేవలం ప్రేమ మాత్రమే
అదే మనిషికి నిజమైన మోక్ష మార్గమే!

- డా. చిట్యాల రవీందర్
7798891795

పాటే శ్వాసగ బతికిన ప్రజావాగ్గేయకారుడు

తెలంగాణ సాంస్కృతిక ఉద్యమంలో పాటను ప్రజాస్వరంగా మండే భాస్వరంగా మలిచిన ప్రముఖ లోకకవి -గాయకుడు అందెశ్రీ. ఆయన పాటలు కేవలం వినోదం కోసం కాదు, అవి సమాజాన్ని ప్రశ్నించే, చైతన్యపరిచే, ఉద్యమించే స్వరాలుగా ప్రసిద్ధిపొందాయి. ప్రజల జీవనవేదనల నుంచే పుట్టిన ఈ పాటలు సామాజిక స్పృహతో నిండిన సాహిత్యంగా నిలిచిపోతాయి. ప్రజాజీవితాన్ని కేంద్రంగా పల్లెటూరి బాణీల్లో పాటలల్లిన వాగ్గేయకారుడాయన. ముఖ్యంగా ఆయన పాటల్లో రైతులు, కూలీలు, నిరుద్యోగులు, మహిళలు, అణచివేయబడిన,అణగారిన వర్గాల జీవనానుభవాలు స్పష్టంగా ప్రతిఫలిస్తాయి. అన్యాయం, ఆకలి, పేదరికం, వలసలు, వంటి రోజువారీ సమస్యలను ఆయన పాటలు భావోద్వేగంతో పాటు ఆలోచనాత్మకంగా వ్యక్తం చేస్తాయి. తన పాటలతో ప్రజలను చైతన్యవంతులను చేయాలనే తపన ఆయన రాసిన ప్రతి పాటలో అంతర్లీనంగా ప్రవహిస్తుంది

ముఖ్యంగా ఆయన పాటలు తెలంగాణ అస్తిత్వాన్ని, భాషాసంస్కృతులను,తెలంగాణ మాండలిక,జానపద ధోరణిని ప్రతిబింబిస్తాయి. అందెశ్రీ తన పాటల్లో వాడే ప్రతీకలే ఆయన పాటలకు ప్రాణం. తెలంగాణ సంస్కృతి పట్ల, ఆ ప్రాంత భాష పట్ల ఎనలేని గౌరవం ప్రేమాభిమానం ఉన్నట్లు ఆ పాటల్ని పరిశీలిస్తే అర్థం అవుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన పాటలు అణగారిన బడుగు, బలహీన స్వరాలకు వేదికగా నిలిచాయని చెప్పొచ్చు.

అందెశ్రీ పాటలు తెలంగాణ ఉద్యమకాలంలో ప్రజలను ఉత్తేజపరిచి, అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడే ధైర్యాన్నిచ్చి, స్వయం నిర్ణాయక హక్కును, గౌరవం కోసం పోరాటం చేసే తెగువను అందించాయి. ఆయన వివిధ సందర్భాల్లో, బాణీల్లో రాసిన పాటలు విన్నఎంతోమంది యువకులు స్వచ్ఛందంగా తెలంగాణ ఉద్యమ పోరాటంలో చురుకైన పాత్ర పోషించారు.

అందెశ్రీ రాసిన చాలా పాటల్లో సామాజిక న్యాయం, మానవీయ దృక్పథం, కుల వివక్ష, లింగ అసమానత, శ్రమదోపిడీప్రస్ఫుటంగాకనిపిస్తాయి. "ఎర్రసముద్రం" అనే సినిమాలో ఆయనరాసినప్రఖ్యాత సందేశగీతం....
మాయమై పోతున్నాడమ్మా మనిషన్నవాడు
మచ్చుకైనా లేదు చూడు మానవత్వం ఉన్నవాడు నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు
నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు
ఏడ ఉన్నడో కానీ కంటికి కనరాడు II
మాయమై పోతున్నాడమ్మా II

మాయమైపోతున్న మనిషి జాడకోసం... ఆధునిక సమాజంలో నశిస్తున్న మానవత్వంపై ఆవేదన ఈ పాటలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ ఆధునికసమాజంలో కృత్రిమ జీవనసరళికి అలవాటుపడ్డ మనుషులు సాటి మనుషుల మీద ఏ మాత్రం జాలి, కరుణ చూపించక స్వార్థ పూరితంగా జీవిస్తూ మానవత్వాన్ని మర్చిపోయి మానవుడినన్న ఎరుకను మర్చి మాయమైపోతున్నవైనాన్ని ఈ పాటలో హృదయ విధారకంగా వర్ణించి శ్రోతలకు కన్నీళ్లు తెప్పిస్తాడు. అందెశ్రీ గేయాలు ఉద్యమ పరిమితిని దాటితాత్విక స్థాయికిచేరుకుంటాయి. ఆయన కేవలం ప్రాంతీయకవి కాదని, ఆధునిక సమాజంలో నశిస్తున్న మానవత్వంపై ఆందోళన చెందినసార్వత్రిక మానవతావాది అని చెప్పుకోవచ్చు.

అందెశ్రీ దృష్టికోణంలో పాట అనేది ఒక కళే కాదు, పాట అనేది ఒక సామాజిక బాధ్యత కూడా. ఆయన పాటల్లో సులభమైన పదజాలం, హృదయానికి హత్తుకునే స్వరం ఉంటుంది. ఎంత సంక్లిష్టమైన సామాజిక సమస్యనైనా తన పాటద్వారా అత్యంత సులువుగా ప్రజలకు చేరవేయగలగడం ఆయన పాటల్లోని ప్రత్యేకత.

అందెశ్రీ సృజియించిన పాటలు సామాజిక స్పృహకు అద్దం పడుతూ ప్రజల బాధలను స్వరాలుగా మార్చే గొప్ప సృజన ప్రక్రియలుగా కనిపిస్తూ మార్పుకోసం ఉద్యమించే శక్తిని అందిస్తాయి. ఆయన పాటలు సమాజం నిండాపర్చుకున్నకాలాతీత చైతన్యకిరణాలు.

అందెశ్రీ సహజకవిగా, ఉద్యమసారథిగా, ప్రజావాగ్గేయకారుడిగా, సిద్ధాంత నిబద్ధత గల సాంస్కృతిక యోధుడిగా,బహుముఖాలుగా కనిపిస్తాడు. అందెశ్రీకి అకాడెమిక్ విద్య లేనప్పటికీ, అతని సృజన కౌశలానికి మెచ్చి కాకతీయ విశ్వవిద్యాలయం అతన్ని గౌరవ డాక్టరేట్ తో సత్కరించింది.

లోకకవిగా ప్రసిద్ధిచెందిన అందెశ్రీ ప్రజల జీవితాల్ని, బాధల్ని, పోరాటాల్ని కవితగా మలిచినవాడు, కన్నీటి అక్షరాలతో పాటలల్లినవాడు. అక్షర జ్ఞానంలేకున్నా లోకజ్ఞానంతో...విద్యాభ్యాసం లేకపోయినా అభ్యాసంతోతెలుగు సాహిత్యంలో ఉన్నతశిఖరాల్ని అధిరోహించిన మహోన్నతవ్యక్తి.తనలోని సహజప్రతిభతో, అప్రతిహతంగా ప్రవహించే ఆశుకవితాధారతో ధారాళంగాగేయకవితలల్లిన అరుదైన కవనయోధుడు. అకాడెమిక్ విద్యకు ప్రత్యామ్నాయంగా లోకానుభవాన్నితనలో ప్రతిష్టించుకొని అకాడమీషియన్లతో ఔరా! అనిపించుకొన్న అద్వితీయ ప్రతిభాశాలి కవిత్వంలో అందెలసందడిగా మోగి, సంగీతంలోఉద్యమనినాదమై, జడివానను పోరాటవీణగాపలికించిన శక్తివంతమైన కవిగాయకుడు అందెశ్రీ. అమ్మను అక్షర శిల్పాల్లో చెక్కి "అమ్మ" అనే పదానికి అమరత్వాన్ని అద్దిన కవిగా "కొమ్మచెక్కినబొమ్మగా" సాధారణ జీవనదృశ్యాన్ని అపురూపగేయశిల్పంగా మలిచిన వాగ్గేయకారుడు.

కొమ్మ చెక్కితె బొమ్మరా కొలిసి మొక్కితె అమ్మరా
ఆదికే ఇది పాదురా కాదంటె ఏదీ లేదురా
జాతి గుండెలో జీవ నదముల జాలువారే జానపదముల గ్రామములు కాపాడ వెలిసిరి గ్రామ దేవతలెందరోయిట II కొమ్మ చెక్కితే II

తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో చైతన్యవంతమైన గీతాల్ని రాశారు. ఉద్యమగీతాలే

అందెశ్రీ
వాగ్గేయకారుడు

కాకుండా అద్భుతమైన సినీగీతాలు కూడా రాసి సినీసాహిత్య చరిత్రలో అజరామరంగా నిలిచిపోయే గీతకారునిగా గుర్తింపు పొందారు. ముఖ్యంగా "జైబోలో తెలంగాణ" చిత్రంలో ఆయన రాసిన ఈ పాట తెలంగాణ ఉద్యమానికి ఊపిర్లూదడమే కాక ఆయనకు నంది అవార్డ్ ను కూడా తెచ్చిపెట్టింది.

జన జాతరలో మన గీతంజయకేతనమై ఎగరాలి
జంఝూ మారుత జననినాదమైజే గంటలు మోగించాలి
ఒకటే జననం ఓహో...!ఒకటే మరణం ఆహా...!
జీవితమంతా ఓహో...!జనమే మననం ఆహా...!
కష్టాల్ నష్టాలెన్నెదురైనాకార్యదీక్షలో తెలంగాణ
జై బోలో తెలంగాణగళగర్జనల జడివాన
జై బోలో తెలంగాణనిలువెల్ల గాయాలవీణా...
IIజనజాతరలో II

ఇక తెలంగాణ రాష్ట్రగీతానికొస్తే! మీ అందరికీ తెలుసు ఆ గీతం యొక్క ఔన్నత్యం. ఆ పాటను అందెశ్రీ తన ప్రాణం పెట్టి రాసిన పాటగా అనునిత్యం మన నాలుకలమీద నడయాడుతుంది. తెలంగాణ సంస్కృతిని, భాషని, నదుల్ని,ఇక్కడి ప్రజల అలవాట్లని, ఆచారాలని, వాళ్ళుఈ ప్రాంతం యొక్క స్వేచ్ఛకోసం ఎన్నో ఏండ్లు చేసిన పోరాటాన్ని,పడ్డ ఆరాటాన్ని అద్భుతమైన తెలంగాణ నుడికారంతో రాయబడిన ప్రాంతీయగీతంగా కొనియాడబడింది.
జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం
ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం
తరతరాల చరితగల తల్లీ నీరాజనం
పదపదాన నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం
జై తెలంగాణ .. జైజై తెలంగాణ
జై తెలంగాణ... జైజై తెలంగాణ ii జయ జయహే II

తెలంగారాష్ట్రఆత్మగా మారిన ఈగీతం పోరుబిడ్డలను పోరాటయోధులుగా మలిచిన పాత్రను పోషించింది. అందెశ్రీ కేవలం గేయకవే కాదు, నిరంతరం నడిచే సిద్ధాంతం. ఉద్యమానికి ఊపిర్లూదిన ఆత్మ. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి సాంస్కృతిక పునాది అయిన ఈ గీతం ద్వారా అందెశ్రీప్రజాచరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడు.
ఇంకా "ఊరుమనదిరా" అనే చిత్రంలోని ఈ అద్భుతమైన "సూడాచక్కని తల్లి" అనే పాటలో ఊరు గొప్పతనాన్ని, ఊరిలోని శ్రమజీవుల జీవితాల్ని, కులవృత్తుల ఔన్నత్యాన్ని గొప్పగా కొనియాడబడింది. ఊరిలోని అన్నికులాల వాళ్ళు ఎలా కలిసిమెలిసి ఉంటారో.. పల్లె వాతావరణాన్ని కళ్ళకు కట్టినట్లు పాటనల్లుతాడు.
సూడా సక్కాని తల్లీ.. సుక్కల్లో జాబిల్లి
నవ్వుల్లో నాగామల్లి.. నాపల్లె పాలవెల్లి
మళ్ళీ జనమంటూ ఉంటె సూరమ్మో..ఓ.. ఓ.. ఓ..
తల్లీ నీ కడుపున పుడతా మాయమ్మా..
తల్లీ నీ కడుపున పుడతా మాయమ్మాII సూడా సక్కాని తల్లీ II

మారిన కాలంతో రంగులు మార్చలేని, విలువలతో రాజీపడలేని ఆత్మాభిమానం గల కవి అందెశ్రీ. ఆధునికకాలంలో అరుదైన నైతికస్థైర్యం కలిగిన సాహిత్యకృషీవలుడు. ఎంతోమంది కవులు, మేధావులు అవకాశవాదానికి లోనవుతుంటే అందెశ్రీ మాత్రం తాను నమ్మిన సిద్ధాంతంకోసంజీవించిన కళాకారుడిగా చిత్రితమయ్యాడు.
తెలంగాణలో పొంగిన కవితల వెల్లువను "నిప్పులవాగు" గా పారించి కవిత్వాన్ని వ్యవసాయంలా సాగుచేసిన అసమాన్య సాహితీ కృషీవలుడు. నిజానికి ఆయన జీవితం జానపద ఆధునికసమ్మేళనం. ఆయన జీవితం ప్రజాచరిత్రగా, ఒకసాంస్కృతిక చారిత్రకపత్రంగా ఆవిష్కరించబడ్డది. ఈ సందర్భంగా ఆకలం యోధునికి తెలంగాణ పోరాటం, ప్రజల గుండెచప్పుడు అన్నీ కలసినమహాకావ్యాత్మక నివాళి. అందెశ్రీ శారీరకంగా వెళ్లిపోయినా, లోకకవిగా ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచిపోయే చిరంజీవి.

- ప్రొఫెసర్ బాణాల శ్రీనివాసరావు
మొబైల్: 9440471423

రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
haneefsd777@gmail.com
whatsapp 9247580946